సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం, 30, మార్చి, 2024

I



వైఎస్సార్‌సీపీలో చేరికలు
కలికిరి మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు శుక్రవారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. –IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
రాయచోటి :	6.30	4.55
రాజంపేట :	6.31	4.55
పీలేరు :	6.35	4.49
మదనపల్లె :	6.33	5.00

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.130	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 249 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	452
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 170.740 కిలోలు

న్యూస్‌రీల్

తలనీలాల విక్రయానికి ఏప్రిల్ 6న టెండర్లు

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో భక్తులు సమర్పించిన తలనీలాల విక్రయానికి ఏప్రిల్ 6న టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు.ఇటీవల భక్తులు సమర్పించిన తలనీలాలకు సంబంధించి (3అడుగుల పొడవు ఉన్నవి 5కిలోలు,2.5 అడుగుల లోపు ఉన్నవి 35 కిలోలు,1.5 అడుగుల పొడవు ఉన్నవి 50 కిలోలు,ఒక్క అడుగు పొడవు కలిగిన తలనీలాలు 80కిలోల విక్రయానికి బహిరంగ వేలం, షీల్డ్ టెండరును నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. 5లక్షలు ధరావత్తు కింద డీడీ కాని,నగదు రూపంలో కాని చెల్లించాలని చెప్పారు. అలాగే 1310 కిలోల ఎండు కొబ్బరికి రూ.లక్ష ధరావత్తు చెల్లించి వేలం పాట,షీల్డ్ టెండరులో పాల్గొనాలని చెప్పారు.

మద్యంపై గంటలోపు సమాచారం



రానామిట్ట చెక్‌పోస్టును పరిశీలిస్తున్న జేసీ ఫర్హాన్ అహ్మద్

బి.కొత్తకోట: కర్ణాటక నుంచి అక్రమంగా వచ్చే మద్యాన్ని పట్టుకున్న గంటలోగా తమకు సమాచారం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్ సీఐ పుణ్యవతిని ఆదేశించారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోట మండలం గుడిపల్లె గ్రామంలోని రానామిట్ట వద్ద ఉన్న సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. చెక్‌పోస్టులో పనిచేస్తున్న సిబ్బంది, విధుల నిర్వహణపై సీఐని అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రా–కర్ణాటక సరిహద్దుల్లోని గ్రామాల వివరాలను తెలుసుకున్నారు. కర్ణాటక నుంచి తరలిస్తూ పట్టుబడే కర్ణాటక మద్యంపై గంటలోపు తమకు సమాచారం ఇవ్వాలని సీఐని కోరారు. మద్యం వివరాలు తెలపాలని సూచించారు. ప్రతిరోజూ రెవెన్యూ కార్యాలయం నుంచి ఒక ఉద్యోగి చెక్‌పోస్టును తనిఖీ చేసి ఇక్కడి పరిస్థితులను తెలుసుకుంటూ ఉండాలని తహసీల్దార్ పుణ్యవతిని ఆదేశించారు.

డీసీసీ బ్యాంకు సీఈఓ సస్పెన్షన్

కడప అగ్రికల్చర్: కడప డీసీసీ బ్యాంకు సీఈఓగా పనిచేస్తున్న కందుల రాజేంద్రకుమార్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కందుల రాజేంద్రకుమార్ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఫేస్‌బుక్‌లో పోస్టు చేసినందుకు.. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఉల్లంఘించినందుకు సస్పెండ్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ సస్పెండ్ చేశారు. ఈయన స్థానంలో డీసీసీ బ్యాంక్ జీఎంగా పనిచేస్తున్న రాజామణికి ఇన్‌చార్జి సీఈఓగా బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అల్లాహ్ దయ అన్ని వర్గాల ప్రజలపై ఉండాలి



ఇఫ్తార్ విందులో డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు కర్జూరం తినిపిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: పవిత్ర రంజాన్ మాసంలో అల్లాహ్ దయ అన్ని వర్గాల ప్రజలపై సమృద్ధిగా ఉండాలని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక అమీన్ ఫంక్షన్ హాలులో ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన జమీల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కె. సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలతో కలిసి పాల్గొన్న ఎంపీ ప్రార్థనలు నిర్వహించి ముస్లింల ఉపవాస దీక్షలను విరమింపజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముస్లింల ఉపవాస ప్రార్థనలు ఫలించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్‌బాషా, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఫీ, షఫీ, పవర్ అల్తాఫ్, చాన్‌బాషా, ఐస్‌క్రీం రవి, సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిబాటలో జీవిత చక్రాలు

నాడు టీడీపీ హయంలో ఆర్టీసీ సంస్థ నిర్వీర్యమైంది. బస్సులు కొనుగోలు చేసేవారు లేదు. ఆర్టీసీ కార్పొరేషన్ సంస్థ. జీతాలు సక్రమంగా అందేవి కావు. సమ్మె చేస్తే జీతాల్లో కోతలు. సమస్యల కోసం ఆందోళనలు చేస్తే మెమోలు. పనిభారం ఎక్కువ. ఇది ఆర్టీసీ సంస్థ గతంలోని పరిస్థితి. ఆర్టీసీ ప్రభుత్వ రంగ సంస్థ అయినా కార్మికులకు అడుగడుగునా అవస్థలు తప్పేవి కాదు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు అన్న మాటే లేదు.

నేడు ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో సంస్థ కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయి. వారికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు వచ్చింది. ఉద్యోగ భద్రత లభించింది. కొత్త బస్సులు కొనుగోలు చేశారు. కారుణ్య నియామకాల ద్వారా ఎంతో మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఎలక్ట్రికల్ బస్సులు వచ్చాయి.



డిపోలో ఆర్టీసీ బస్సులు

- విలీనంతో ఆర్టీసీ ఉద్యోగులలో హర్షాతిరేకం
- సీఎం జగన్ సాహసోపేత నిర్ణయంతో ఉద్యోగ భద్రత
- జిల్లాలో 2,155 కుటుంబాల్లో ఆనందం

డిపో	మొత్తం ఉద్యోగులు
మదనపల్లె–1	456
మదనపల్లె–2	417
పీలేరు	431
రాజంపేట	337
రాయచోటి	500
ఆర్ఎం కార్యాలయం	14

మదనపల్లె సిటీ: ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఆర్టీసీ మరింత అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ప్రభుత్వంలోకి విలీనం చేసి నాలుగేళ్లు పూర్తవుతుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఆచరణలోకి పెట్టేందుకు ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లో కమిటీ వేశారు. ఆరు నెలల్లో ఆచరణలో పెట్టారు. 2020 జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తేవడంతో కార్మికులంతా ప్రజా రవాణాశాఖ ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. దశాబ్దాల తరబడి ఎవరూ చేయని సాహసవంతమైన నిర్ణయాన్ని ముఖ్యమంత్రి అమల్లోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఉద్యోగుల కష్టాలు తొలగిపోయాయి. నాలుగేళ్లగా వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, బెనిఫిట్స్, అలవెన్స్ అందుతున్నాయి. ఈ నిర్ణయంతో జిల్లాలో 2,155 కుటుంబాల్లో సంతోషాలు నిండాయి.



నాడు సమ్మెలు చేస్తే జీతాలు కట్

ఆర్టీసీ ఇస్తున్న వేతనాలు చాలక డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కార్మికులు ఎన్నో సార్లు సమ్మెలు, పోరాటాలు చేశారు. అయినా తగిన ప్రతిఫలం దక్కలేదు. గత టీడీపీ ప్రభుత్వం కార్మికులను వేధించి, సమ్మె కాలానికి జీతాలు కోసి ఉక్కుపాదం మోపింది. ఉద్యోగ భద్రత కరువై కార్మికులు రోజులు లెక్కపెట్టుకున్నారు. వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే తమ సమస్యలకు పరిష్కారం లభించిందని ఆర్టీసీ ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

'లాక్‌డౌన్'లోనూ ఠంచన్‌గా జీతాలు

కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా రెండేళ్లలో సుమారు నాలుగు నెలలకు పైగా బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. ఆ పరిస్థితులు గతంలో ఎదురైతే కార్మికుల వేతనాల్లో కోతలు పడేవి. అప్పటికే ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఎన్ని కష్టాలు ఉన్నా ఒకటో తేదీన ఠంచన్‌గా జీతాలు అందాయి. ఇలా జీతాలు చెల్లించడం చరిత్రలో మొదటిసారి అని ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

మాట తప్పని ముఖ్యమంత్రి




ఆర్టీసీ కార్మికుల సమస్యలకు సీఎం జగన్ శాశ్వత పరిష్కారం చూపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆర్టీసీ విలీనం ప్రక్రియ పూర్తి చేసి మాట నిలుపుకున్నారు. కరోనాలోనూ జీతాలు బ్రేక్ లేకుండా చూశారు. కార్మికుల మేలు కోరిన ఏకైక సీఎం.– నారదరెడ్డి, వైఎస్సార్ ఈయూ గౌరవ అధ్యక్షుడు, మదనపల్లె

ప్రభుత్వ ఉద్యోగులతో సమానం



ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు ప్రజా రవాణా శాఖలోకి విలీనం చేయడంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, అలవెన్స్ అందుతున్నాయి.
–జింకా వెంకటాచలపతి, ఈయు టు డిపో గౌరవ అధ్యక్షులు, మదనపల్లె

బాబుకు పేదలంటే కడుపుమంట!



టీడీపీ అధినేత చంద్రబాబు పేదలపై తన అక్కసును మరోసారి వెళ్లగక్కారు. ఇదివరకు తోకలు కత్తిరిస్తా.. తాట తీస్తా అంటూ బడుగువర్గాలపై నోరుపారేసుకున్న బాబు తాజాగా మరోసారి తన కడుపుమంటను బయటపెట్టారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం ప్రజాగళం సభలో శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థి వీరాంజనేయులపై చంద్రబాబు తన నోటి దురుసును బయటపెట్టారు.టిప్పర్ డ్రైవర్‌కు వైఎస్సార్‌సీపీ టికెట్ ఇచ్చిందంటూ కించపరిచారు. ఓ వైపు పెత్తందారులకు.. పేదలకు మధ్య యుద్ధమంటూ వైఎస్ జగన్ చెబుతున్న నేపథ్యంలో.. చంద్రబాబు వ్యాఖ్యలు నిజమేనని రుజువు చేశాయి. చంద్రబాబు వ్యాఖ్యలపై టిప్పర్ డ్రైవర్లు మండిపడ్డారు.
–సాక్షి నెట్‌వర్క్

వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం



కుటుంబాన్ని పోషించుకునేందుకు కష్టపడుతున్న పేద డ్రైవర్ల గురించి చంద్రబాబు నాయుడు చులకనగా మాట్లాడటం మా మనోభావాలను దెబ్బతీశాయి. చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం. –జంపయ్య, డ్రైవర్, మంగంపేట, ఓబులవారిపల్లె

ఇది మంచి పద్ధతి కాదు



శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని డ్రైవర్ అని హేళన చేసిన చంద్రబాబుకు ఎన్నికల్లో డ్రైవర్లు కలిసి బుద్ధి చెబుతాం. డ్రైవర్ అంటూ చులకన చేసి మాట్లాడం మంచి పద్ధతి కాదు. మంచి డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కింది.
–రిజ్వాన్, డ్రైవర్, మదనపల్లె

డ్రైవర్ల గురించి మాట్లాడే అర్హత బాబుకు లేదు



డ్రైవర్ల గురించి చులకన చేసి మాట్లాడటం మంచి పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేయవచ్చు. డ్రైవర్లు పోటీ చేయకూడదనేది ఎక్కడైనా ఉందా? వైఎస్సార్‌సీపీ అన్ని వర్గాలకు న్యాయం చేసింది. –బాబ్‌జాన్, డ్రైవర్, మదనపల్లె

డ్రైవర్లంటే చిన్నచూపు తగదు



డ్రైవర్లంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎందుకు అంత చిన్నచూపు. డ్రైవర్ లేకుంటే ఆయన వాహనం ముందుకు వెళ్లదు. డ్రైవర్ ఎమ్మెల్యేగా పోటీ చేయకూడదా.. ఈవిధంగా మాట్లాడిన చంద్రబాబుకు ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతాం. –మధు యాదవ్, డ్రైవర్, రాజంపేట

ఆగస్టులో ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్సకళాశాల) ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఆగస్టు నెల 11, 12 తేదీల్లో ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం కడపలోని ఆర్ట్స్ కళాశాలలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 75 సంవత్సరాల ఘనచరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు పూర్వ విద్యార్థులందరూ తప్పక హాజరుకావాలన్నారు. అదే విధంగా కళాశాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ పి. రాజశేఖర్ మాట్లాడారు. లయన్ కె. చిన్నపరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

దగాపడ్డ తమ్ముళ్లు!

- ఆశావహులపై 'బాబు'నీళ్లు
- సుబ్రహ్మణ్యం ఎంపికపై టీడీపీ వర్గీయుల్లో తీవ్ర అసంతృప్తి
- రాజంపేటలో రాజీనామాలకు సిద్ధపడ్డ పార్టీ క్యాడర్



సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చేతిలో రాజంపేట తమ్ముళ్లు మరోసారి దగాపడ్డారు. శుక్రవారం రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే టికెట్, గతంలో రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యంకు టికెట్ కేటాయించడంతో రాజంపేట టీడీపీ వర్గీయుల్లో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. తాము ఆశించిన నేత, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడుకు ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో పలువురు పార్టీ క్యాడర్‌లోని నేతలు రాజీనామాలు చేస్తామని అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేశారు. టీడీపీ కరపత్రాలను దగ్ధం చేశారు. తమనేత బత్యాల అభ్యర్థి కాకపోతే రాజంపేటలో టీడీపీ ఓటమి తథ్యమని తమ్ముళ్లు స్పష్టం చేశారు. రాజంపేట బత్యాల భవన్ వద్ద టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు హల్చల్ చేశారు. తమ నాయకుడు చెంగల్రాయుడు కు రాజంపేట టీడీపీ టికెట్ రాకపోవడంతో మందా శీను మనస్తాపం చెందారు. తమ నాయకుడికి టికెట్ ఇవ్వాలని, లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని భవనం పైకెక్కాడు. వెంటనే అప్రమత్తమైన టీడీపీ శ్రేణులు సముదాయించి కిందికి దింపారు. కాగా రాజంపేట టికెట్‌ను టీడీపీ నుంచి బత్యాల చెంగల్రాయుడుతోపాటు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ పోలి సుబ్బారెడ్డి, మరో నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి టికెట్ ఆశించిన వారిలో ఉన్నారు. టీడీపీ పార్టీ ఆవిర్భావం రోజున వీరందరికి చంద్రబాబు షాక్ ఇచ్చారు.

చతికిలపడ్డ 'సేన'

రాజంపేటలో జనసేనకు టికెట్ దక్కుతుందన్న ఆశతో నియోజకవర్గంలో పలువురు జనసేన తరఫున కార్యక్రమాలు చేపట్టారు. నందలూరుకు చెందిన యల్లటూరు శ్రీనువాసురాజు ఏకంగా తన ఉద్యోగ పదవికి వీఆర్ఎస్ ఇచ్చి మరీ జనసేనలో చేరారు. అలాగే కాపు సామాజికవర్గానికి చెందిన అతికారి దినేష్, మలిశెట్టి వెంకటరమణ టికెట్‌ను ఆశించి భంగపడ్డారు.

అనుహ్యంగా తెరపైకి బాలసుబ్రమణ్యం..

రాజంపేట టీడీపీ టికెట్ సుగవాసి బాలసుబ్రమణ్యంకు కేటాయించడంతో టీడీపీ రాజకీయాలు వేడెక్కాయి. నాన్‌లోకల్‌ను రాజంపేటకు తీసుకొచ్చి మరి పోటీ చేయించడంపై టీడీపీ కేడర్ పెదవివిరుస్తోంది.

2న మదనపల్లెలో మేమంతా సిద్ధం

- ములకలచెరువులో 1న రాత్రి బస
- బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి.
- విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపు



ఎంపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు



టిప్పుసుల్తాన్ మైదానంలో మేమంతా సిద్ధం బహిరంగసభ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిలరఘురామ్

మదనపల్లె: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో భాగంగా ఏప్రిల్ 2న మదనపల్లె పట్టణానికి రానున్నారు. పట్టణంలోని టిప్పుసుల్తాన్ మైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగసభను నిర్వహించనున్నారు. సభావేదిక స్థలాన్ని శుక్రవారం ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి తదితరులు పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బహిరంగ సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలిరానున్నారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ...ఏప్రిల్ 1వ తేదీన మేమంతా సిద్ధం బస్సుయాత్ర అన్నమయ్య జిల్లాలో ప్రవేశిస్తుందన్నారు. ఆరోజు రాత్రి ములకలచెరువులో బసచేసి, మరుసటిరోజు 2వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు మదనపల్లె టిప్పుసుల్తాన్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. అదేరోజు రాత్రి చిత్తూరుజిల్లాలోకి ప్రవేశించి, పుంగనూరు నియోజకవర్గంలో రాత్రి బస తర్వాత 3వతేదీ పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల పరిధిలో బస్సుయాత్రలు ఉంటాయని వెల్లడించారు. తర్వాత తిరుపతి జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో, కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందించిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని రెట్టించిన ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రకటించే మేనిఫెస్టో కోసం సామాన్యులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. 2019 ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రకటించిన మేనిఫెస్టోలో వంద శాతం హామీలను అమలుచేయడమే జగనన్న విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, పీకేఎం–ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, తట్టిశ్రీనివాసులురెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, జబ్బలశ్రీనివాసులు, సాయిప్రసాద్‌రెడ్డి, కోటూరిఈశ్వర్, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, రామిశెట్టిశివయ్య తదితరులు పాల్గొన్నారు.

▶▶ టీడీపీకి ఓటువేస్తే బీజేపీకి వేసినట్లే!

బీజేపీకి ఓటువేస్తే మైనారిటీలకు అన్యాయం జరుగుతుందని, గతంలో మాట్లాడిన చంద్రబాబు... నేడు అదే పార్టీతో పొత్తు పెట్టుకుని ముస్లింలను మోసగించి, అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాడని, బాబు జిమ్మిక్కు రాజకీయాలను మైనారిటీ సోదరులు గ్రహించాలని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 2న మదనపల్లెలో జరగనున్న మేమంతా సిద్ధం బహిరంగసభ ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన ఆయన, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రెండురోజుల క్రితం మాజీ సీఎం చంద్రబాబు మదనపల్లె ప్రజాగళం సభలో..హంద్రీనీవా కాలువ పూర్తిచేస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీలు ఇచ్చి వెళ్లారని...టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కుప్పం వరకు ఎందుకు నీళ్లు తేలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, కాలువ పనులు పూర్తిచేయించడమే కాకుండా కుప్పానికి కృష్ణాజలాలు తరలించారన్నారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలువను వెడల్పుచేసి తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు సాగు,తాగు నీటికి ఇబ్బంది లేకుండా, గాలేరు–నగరి, హంద్రీనీవాలను అనుసంధానం చేసి శాశ్వత పరిష్కారానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మెడికల్ కాలేజీ, బీటీ కాలేజ్ యూనివర్శిటీ, గ్రామాల్లో రోడ్లు, నేషనల్ హైవే తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. జిల్లా ఆస్పత్రి, మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, అభివృద్ధి జరిగిందన్నారు. తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. అత్యధిక సంఖ్యలో రోడ్లు, రిజర్వాయర్లు, ఇరిగేషన్ పనులు పూర్తయ్యాయన్నారు. టీడీపీ హయాంలో ఐదేళ్లకు ఐదురోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. మైనారిటీలకు అన్యాయం చేయమంటూనే, 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు... ముస్లింలకు ఒక మంత్రి పదవి ఇవ్వకపోగా, కేవలం ఒకసీటు కేటాయించి, టీడీపీ నాయకులే ఓడించారన్నారు. మైనారిటీలు వీటన్నంటిపై దృష్టిపెట్టి... పొత్తుతో వస్తున్న టీడీపీ, బీజేపీలకు బుద్ధి చెప్పాలన్నారు. మదనపల్లె వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌ఆజం, పీకేఎం–ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, యువనాయకులు బి.శశాంక్‌రెడ్డి, అక్కులప్ప పాల్గొన్నారు.

చురుగ్గా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

- టీటీడీ సీఈ నాగేశ్వరరావు



కల్యాణ వేదిక వద్ద పనులను పరిశీలిస్తున్న టీటీడీ సీఈ నాగేశ్వరరావు, తదితరులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న శ్రీ ఒంటిమిట్ట కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఒంటిమిట్టలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం వద్ద జరుగుతున్న పనులను, అలాగే కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. టీటీడీ ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, సివిల్ ఈఈ సుమతి, వాటర్ వర్క్స్ ఈఈ మల్లికార్జునప్రసాద్, డీఈ ఎలక్ట్రికల్ చంద్రశేఖర్, డిప్యూటి సివిల్ నాగరాజు, డిప్యూటీ ఎలక్ట్రికల్ వెంకటరత్నం, ఏఈ సివిల్ అమర్‌నాథ్‌రెడ్డి, ఏఈ ఎలక్ట్రికల్ నందిబాబు, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ. 14 లక్షలు స్వాధీనం

చిట్వేలి : చిట్వేలి–రాపూరు ప్రధాన రహదారిలో రాజుకుంట క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్టులో శుక్రవారం మధ్యాహ్నం తనిఖీలు చేస్తుండగా రూ. 14 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. కోడూరు–రాజంపేట ప్రాంతాల నుంచి ప్రతి శుక్రవారం కొందరు రైతులు, జీవాల వ్యాపారస్తులు మ్యాక్సీలో గూడూరు సంతకు వెళ్లి తాము తీసుకెళ్లిన జీవాలను అమ్ముకోవడం, అక్కడ నుంచి కొన్ని జీవాలను తెచ్చుకుంటూ ఉంటారు. ఈ నేపథ్యంలో గూడూరు సంత నుండి తిరిగి స్వస్థలాలకు తిరిగివస్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. అయితే ఆ నగదుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి రసీదులు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రూ. 3 లక్షలు పట్టివేత

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కో–ఆపరేటివ్ కాలనీ సమీపంలో శనివారం ఆకస్మికంగా పోలీసులు తనిఖీలు చేశారు. షేక్ సమీర్ అనే వ్యక్తి దగ్గరి నుంచి రూ. 3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును తదుపరి చర్యల కోసం ఇన్‌కం ట్యాక్స్ వారికి పోలీసులు పంపించారు.

పెయింట్ టిన్నర్ తాగి బాలుడికి అస్వస్థత


పెయింట్ టిన్నర్ తాగిన బాలుడు వేదిక్

మదనపల్లె : జ్యూస్ అనుకుని పెయింట్ టిన్నర్ తాగి బాలుడు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. బి.కె.పల్లికి చెందిన వేదిక్ (4) తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా ఎదురింటికి ఆడుకునేందుకు వెళ్లాడు. అక్కడ ఇంటి పెయింట్ పనులు జరుగుతున్నాయి. అక్కడ పెయింట్‌లో వాడే టిన్నర్‌ను జ్యూస్ అనుకుని వేదిక్ తాగాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు లోనవగా వేదిక్‌ను ఆ ఇంటి కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి


మృతుడు బాబుషా (ఫైల్)

రాజుపాళెం : మండల పరిధిలోని తొండలదిన్నె గ్రామానికి చెందిన నొస్సం బాబుషా (17) అనే యువకుడు శుక్రవారం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. రాజుపాళెం ఎస్‌ఐ తులసీనాగప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... గ్రామంలోని టంగుటూరుకు వెళ్లే రహదారిలో నొస్సం సంజీవ కౌలుకు భూమిని తీసుకుని వరి పంటను సాగు చేసుకుంటున్నారు. ఆ పొలానికి సాగు నీరు పారించేందుకు ఆయన కుమారుడు బాబుషా అక్కడికి వెళ్లాడు. సాగునీటిని విడిచే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ మోటార్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని తండ్రి సంజీవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎవరి దారి వారిదే

- వర్గాల వారీగా పార్టీ ఆవిర్భావం కార్యక్రమం
- టీడీపీలో మారని తమ్ముళ్ల తీరు

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీలో అసమ్మతి కుమ్ములాటలు ఏ మాత్రం కట్టడి కాలేదు. తమ్ముళ్ల మధ్య ఐక్యత కలగానే మారింది. అది ఏ సందర్భమైనా సరే వర్గ పోరు తప్పడం లేదు. శుక్రవారం కడప నగరంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమావేశం ఎవరికి వారే నిర్వహించారు. తమ మధ్య ఉన్న విబేధాలను మరో మారు బట్టబయలు చేశారు.

కడప నగరంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఆ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, కార్యకర్తలకు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి ఆయన సతీమణి కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిరెడ్డి తదితరులు హాజరయ్యారు. కాగా శ్రీనివాసులురెడ్డిని వ్యతిరేకిస్తున్న ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, మాజీ కడప ఇన్‌ఛార్జ్ అమీర్‌బాబు ఆధ్వర్యంలో రహమతీయా ఫంక్షన్ హాల్‌లో పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచారు. ఈ వర్గ పోరు ఎంత వరకు వెళుతుందో అని ఆ పార్టీ తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు.

టీడీపీ యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన....

తెలుగుదేశం పార్టీ యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తోంది. కడప నగరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నేతలు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అక్కడ ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎన్నికల కోడ్ నిబంధనలు అమలులో భాగంగా ముసుగు వేశారు. దీంతో ఆ పార్టీ నేతలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా అక్కడికి ప్రత్యేకంగా ఎన్టీఆర్ విగ్రహంను తీసుకొచ్చి పూల దండలు వేశారు. కేక్ కట్ చేసి కార్యక్రమం నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న అధికారులు సీరియస్ అయ్యారు. కోడ్ ఉల్లంఘనపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి సంబంధిత నేతలపై కేసుల నమోదుకు చర్యలు చేపట్టారు.


కడప ఎన్టీఆర్ కూడలి వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని తెచ్చి టీడీపీ ఆవిర్భావ కార్యక్రమం నిర్వహిస్తున్న నేతలు

టీడీపీలో బహిర్గతమైన వర్గ విభేదాలు


రాఘవరాజుపురంలో టీడీపీ కార్యాలయం వద్ద ముక్కా రూపానందరెడ్డి వర్గం

రైల్వేకోడూరు అర్బన్ : టీడీపీలో మరోమారు వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. శుక్రవారం విశ్వనాథనాయుడు వర్గం, ముక్కా రూపానందరెడ్డి వర్గం వేరు వేరుగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇటీవల రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న కస్తూరి విశ్వనాథనాయుడిని ఇన్‌చార్జ్‌గా తప్పించి ఆ పదవిని వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన ముక్కా రూపానందరెడ్డికి అప్పజెప్పారు. దీంతో రోజురోజుకు ఇరు వర్గాల మధ్య విబేధాలు బహిర్గతమవుతూనే ఉన్నాయి. ఒకరు టీడీపీ కార్యక్రమం నిర్వహిస్తే మరొక వర్గం రాకుండా దుమ్మా కొడుతుంది. మా క్యాండెట్‌కు టికెట్ కావాలి అంటే.. మరొక వర్గం మా మనిషిని టీడీపీ అభ్యర్థిగా నిలబెట్టండని చంద్రబాబు వద్ద వాదనకు దిగిన విషయం తెలిసిందే. శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి కుమారుడు ముక్కా సాయివికాస్ రెడ్డి కోడూరు మండలంలోని రాఘవరాజుపురంలో ప్రధాన రహదారి పక్కనే ఒక బిల్డింగ్‌ను అద్దెకు తీసుకుని టీడీపీ కార్యాలయంగా మార్చుకుని అక్కడే తమ వర్గంతో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఇందులో 2019లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన పంతగాని నరసింహ ప్రసాద్, టీడీపీ టికెట్ ఆశించిన దుద్యాల అనితా దీప్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు వర్గం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించింది.


పట్టణంలో టీడీపీ కార్యాలయం వద్ద కస్తూరి విశ్వనాథనాయుడి వర్గం



నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



నేను వ్యవసాయ పనులు చేసుకొని జీవనాన్ని కొనసాగిస్తున్నాను. నా భర్త మరణించాడు. కూతురు, కొడుకు ఉన్నారు. అద్దె ఇంట్లో ఉంటున్నాము. గత ప్రభుత్వంలో చాలా సార్లు ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నా మంజూరు కాలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత నాకు మా వాలంటీర్ ఇంటి కోసం దరఖాస్తు చేశాడు. నాకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైంది. ఇప్పుడు నేను సిద్దవటం లోని జగనన్న కాలనీలో ఇండ్లు నిర్మించుకుంటున్నాను. నా సొంత ఇంటి కల నెరవేరింది. నేను జగనన్నకు రుణపడి ఉంటా.

– జి. పెంచలమ్మ, ఎగువపేట, సిద్దవటం

నాడు-నేడు ద్వారా విద్యాభివృద్ధి



గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఓ వైపు పాఠశాలల్లో వసతులు, మరో వైపు విద్యార్థులకు విద్యా సామాగ్రి సకాలంలో అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య అందుతోంది. గతం కంటే ఫలితాలు మెరుగు పడ్డాయి. అందుకే ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో ప్రభుత్వ విద్యార్థులు కూడా పోటీ పడుతున్నారు. ముఖ్యంగా ఇంగ్లీష్ మీడియంలో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈ మార్పు చూడలేదు. కేవలం జగనన్న సీఎం అయ్యాకే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ని వసతులు కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు

– నాగేంద్ర, ఎల్లారెడ్డిపల్లె, కమలాపురం మండలం

నాకు జగనన్నే దేవుడు



నేను పుట్టుకతోనే వికలాంగుడిని. నా వయస్సు 25 సంవత్సరాలు. చిన్న వయస్సులోనే నాన్న చనిపోయాడు. నా తల్లి కూలీ పనులకు వెళ్లి నా ఆలనాపాలన చూసుకునేది. వికలాంగ పింఛన్ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశాను. కానీ ఏ ప్రభుత్వం కనికరించలేదు. మా అమ్మకు వయస్సు మీదపడి ఒక్కొక్క రోజు కూలీ పనులకు వెళ్లలేని పరిస్థితి. నా భారం ఆమే మోస్తుండటంతో ఎందుకు బతకాలి అనిపించి నాలో నేను కుమిలిపోయేవాడిని. ఇంత వయస్సు వచ్చినా ఏ పని చేయలేకపోతున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసి వలంటీర్లను నియమించడంతో అర్హత ఉన్న ప్రతిఒక్కరికి పథకాలు ఇస్తున్నారని నేను కూడా పింఛన్ కోసం వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. నాకు పింఛన్ మంజూరైంది. 2023 సెప్టెంబర్ నుండి వికలాంగ పింఛన్ రూ.3 వేలు తీసుకుంటున్నాను. నాకు పింఛన్ ఇచ్చి ఆదుకున్న జగనన్నే నా దేవుడు.

– కుందేటి కిరణ్ కుమార్, సూరేపల్లె, గోపవరం మండలం

కాపులంతా వైఎస్సార్‌సీపీ వెంటే

కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణస్వామి రాయల్

కడప రూరల్ : గతంలో ఎన్నడూ లేని విధంగా కాపులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణస్వామి రాయల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పు కాపు వర్గీయుల అభ్యున్నతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యపడిందన్నారు. సీనియర్ నాయకుడిని అని చెప్పుకొనే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పాలనలో కాపులు ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటు తనంను అనుభవించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ కాపుల సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో కాపులకు దాదాపు 40 ఎమ్మెల్యే, 6 ఎంపీ స్థానాలను కేటాయించడం చారిత్రాత్మకం అని అన్నారు. ఇప్పటికే కాపు వర్గీయులైన ముగ్గురికి ఛైర్మెన్, ఒకరికి తిరుమల తిరుపతి దేవ స్థానం బోర్డు సభ్యులు, ఇలా పలు పదవులను కేటాయించారన్నారు. అలాగే కాపు నేస్తం పథకం ద్వారా కాపులకు చేయూత ఇచ్చారన్నారు. చంద్రబాబు పాలనలో కాపుల సంక్షేమం పూర్తిగా కుంటుపడిందన్నారు. గతాన్ని మరచిన కొంతమంది టీడీపీ నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే కాపులంతా నడుస్తారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో గెలుపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ అధ్యక్షులు గాజులపల్లె సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షులు నాగేళ్ల సుబ్బనరసింహులు, ప్రధాన కార్యదర్శి యు. వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


ఐక్యతను చాటుతున్న కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణస్వామి రాయల్ తదితరులు

శివచంద్రారెడ్డి రూ. 2.5 కోట్లకు అమ్ముడుపోయాడు


మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్ యాదవ్, కల్లూరు నాగేంద్రా రెడ్డి

ప్రొద్దుటూరు : నిన్నటి వరకు వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి వీరవిధేయుడినంటూ ప్రగల్భాలు పలికిన కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి టీడీపీ నేతల వద్ద రూ.2.50 కోట్లకు అమ్ముడుపోయాడని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి విమర్శించారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి కుమారుడితో హైదరాబాద్‌లో చర్చలు జరిపి సెట్ చేసుకున్నారన్నారు. శనివారం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నారని, అందుకోసమే వరదరాజులరెడ్డి శుక్రవారం శివచంద్రారెడ్డి ఇంటికి వెళ్లారన్నారు. వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి ఫొటోలు వేసుకుని ఎన్నికల్లో శివచంద్రారెడ్డి సర్పంచ్‌గా గెలిచారన్నారు. గతంలో పార్టీ మారిన వార్డు మెంబర్లను పశువులు అని మాట్లాడిన శివచంద్రారెడ్డిని ప్రస్తుతం ఏమి అనాలని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాం రెడ్డి, మాజీ సర్పంచ్ గురుస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీలో 200 కుటుంబాల చేరిక

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేయాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అమీన్ ఫంక్షన్ హాలులో ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన జమీల్, ముస్తాక్‌ల ఆధ్వర్యంలో 200 కుటుంబాలకు చెందిన ముస్లిం, మైనార్టీలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్ బాబులు పేరు పేరునా పలకరించి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్ జగన్ ప్రజలకు అందిస్తున్న ప్రజా రంజకపాలనకు ఆకర్షితులై 39, 38, 37, 41, 42 డివిజన్లకు సంబంధించిన వారు వైఎస్సార్‌సీపీలో చేరడం అభినందనీయమన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు ఆపకుండా ప్రజలకు మేలు చేసిన జగనన్నకు అండగా నిలిచేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీలో గెలిపించాలని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కడప అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఎస్‌బి అంజద్‌బాషా, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. అనంతరం హకీమ్ మహ్మద్ జాఫర్ రచించిన 'మెడికల్ సైన్స్ వెలుగులో రంజాన్ ఉపవాసాలు' అనే పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. పార్టీలో చేరిన వారిలో ముస్తాక్, ఆఫిల్, నందలూరు ఫయాజ్, జిలానీ, మస్తాన్, అఫ్రోజ్, అమీర్, జాకీర్, రహీం తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహమ్మద్‌బాషా, అరీపుల్లా బాషా, ఆజమ్, పులి సునీల్, నిత్యానందరెడ్డి, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టా పర్యటనలో అపశ్రుతి

– బాణాసంచా అగ్గిరవ్వలు పడి గడ్డివాముల దగ్ధం

ఖాజీపేట : టీడీపీ మైదుకూరు నియోజకవర్గ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ పర్యటన కారణంగా గడ్డవామి దగ్ధమై రైతులకు నష్టం జరిగింది. ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచార నిమిత్తం పుట్టా సుధాకర్ యాదవ్ పర్యటించారు. పర్యటనలో భాగంగా టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంలో నిప్పురవ్వలు పడి రెండు పెద్ద గడ్డివాములు దగ్ధమయ్యాయి. బీచుసుబ్బారెడ్డి, బీచు వెంకటసుబ్బారెడ్డి రైతులకు చెందిన రెండు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. అసలే వేసవికాలం గడ్డి దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో గడ్డివాములు పూర్తిగా కాలిపోవడంతో పశువులకు పశుగ్రాసం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పర్యటనలు చేసేటప్పుడు నిబంధనల మేరకు పర్యటించాలని, ఇలా అత్యుత్సాహం కారణంగా రైతులకు నష్టం కలిగేలా చేయడం సరైంది కాదని ఆవేదన చెందారు.


గడ్డివాములు కాలిపోతున్న దృశ్యం

35 చీరలు పట్టివేత

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కారును తనిఖీ చేసి 35 చీరలను స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌక్ పోలీసులు తెలియజేశారు. ప్రొద్దుటూరు వస్త్రభారతి షాపింగ్ మాల్‌లో దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి శుక్రవారం మాధవరంలో 35 చీరలు కొనుగోలు చేసి ప్రొద్దుటూరుకు కారులో తీసుకుని వెళ్తుండగా వాహన తనిఖీల్లో ఈ చీరలను గుర్తించి సీజ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్‌కు గాయాలు


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లెక్చరర్ సత్యనారాయణ

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు లెక్చరర్ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం చిన్నమండ్యం మండలంలో జరిగింది. వాల్మీకిపురం పట్టణం రాంనగర్‌కు చెందిన కె.సత్యనారాయణ (40) మదనపల్లెలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఇంటర్‌పరీక్షల మూల్యాంకనానికి ద్విచక్రవాహనంలో రాయచోటికి బయలుదేరి వెళ్లాడు. చిన్నమండ్యం సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో బాధితుడిని 108 అంబులెన్స్ వాహనంలో గుర్రంకొండ పీహెచ్‌సీకి తరలించారు. చికిత్స అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి తిరుపతికి తీసుకువెళ్లారు. చిన్నమండ్యం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.


ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

చిన్నమండెం : మండల పరిధిలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో సత్యనారాయణరావు అనే ద్విచక్రవాహనదారుడికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ వాయల్పాడుకు చెందిన సత్యనారాయణరావును గుర్రంకొండ ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

బి.కొత్తకోట : మైనర్ బాలికను వేధించిన కేసులో నిందితున్ని శుక్రవారం అరెస్ట్ చేశామని సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు. బి.కొత్తకోట పట్టణం వాయలవంకకు చెందిన జి.రమణ అనే యువకుడు మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలిక స్థానికంగా డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. రోజూ కళాశాలకు వచ్చి వెళ్తుండేది. కొంతకాలంగా రమణ బాలికను వేధింపులకు గురిచేస్తున్నాడు. భయపడి ఈ విషయం ఇంట్లో చెప్పలేదు. ఈ నేపథ్యంలో బుధవారం బాలిక కళాశాలకు వెళ్తుండగా రమణ మార్గమధ్యలో అడ్డుపడి వేధించాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు రాకతో రమణ పరారయ్యాడు. ఈ వేధింపులపై గురువారం బాధిత బాలిక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, నిందితుడు రమణను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

తల్లిబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు


అదృశ్యమైన చైతన్య (ఫైల్)

మదనపల్లె : తల్లిబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలిబసు తెలిపారు. గాలివీడు మండలం పందివారిపల్లెకు చెందిన నమస్తేనాయక్, చైతన్య(22) భార్యభర్తలు. మూడు సంవత్సరాల క్రితం జీవనోపాధికై మదనపల్లెకు వచ్చి పి.అండ్‌టి కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరికి గాంధీనాయక్ (2) కుమారుడు ఉన్నాడు. నమస్తేనాయక్ ఓ ప్రైవేటు వైద్యశాలలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం కుమారుడు గాంధీనాయక్‌తో కలిసి ఇంటి నుంచి వెళ్లిన చైతన్య కనిపించకపోవడంతో భర్త పలు చోట్ల వెతికాడు. సమాచారం లభించకపోవడంతో శుక్రవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పొట్టేకులవారిపల్లి నాయకులు, కార్యకర్తలు


మైనార్టీ జేఏసీ నేత ఎంఐ హనీఫ్ ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న యువత


గుండ్లూరు మాజీ సర్పంచ్ మురళీనాథరెడ్డి, ఉప సర్పంచ్ సురేష్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కలికిరి : మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు శుక్రవారం రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసిన ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా పని చేయాలని, ఎన్నికలలో గెలుపు లక్ష్యంగా ముందుకెళ్ళాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో మండలంలోని గుండ్లూరు గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డివారి మురళీనాథ రెడ్డి, ఉప సర్పంచ్ సురేష్, వీరి అనుచరులు, కలికిరి గ్రామ పంచాయతీ పరిధి పొట్టేకులవారిపల్లి నుంచి శివకుమార్ రెడ్డి, రాజారెడ్డి, గౌతమ్, తిప్పారెడ్డి, విశ్వనాథ, బోష్, హరి, తొమ్మల రవి, ప్రేమ్‌కుమార్, రామప్ప, తిమ్మయ్య, ఎల్లప్ప, సురేష్ కుమార్ లతో పాటు 50 మంది ఉన్నారు. ముస్లిం జేఏసీ నాయకుడు ఎంఐ హనీఫ్ ఆధ్వర్యంలో యువత ఫిరోజ్, చంటి, వినోద్, బావాజీ, భద్రయ్య, జబ్బార్, వెంకటరమణ, మణి, మహబూబ్ బాషా, ఫర్హాద్, రెడ్డిబాషా, నాని, రాజా, సయ్యద్, ఆబీద్, ఇంకా 30 మంది పార్టీలో చేరారు.